తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 15 - జనవరి 2026 | సంపుటి:3 | సంచిక:228 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




సంక్రాంతి సందర్భంగా తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక గురువారం సెలవు.. శుక్రవారం సంచిక వెలువడదు.. శనివారం మళ్ళీ కలుద్దాం..



## మహిళలపై వ్యక్తిత్వ దాడులు అంగీకారయోగ్యం కాదు

- విమర్శ పేరుతో క్రూరత్వం సహించబోం
- మహిళల గౌరవమే సమాజ భవిష్యత్‌కు పునాది
- సీపీ సజ్జనార్

2లో

# ఆధార్ అప్‌డేట్ పేరిట మోసాలు

### నకిలీ సందేశాలపై అప్రమత్తంగా ఉండాలి

### ప్రజలకు తెలంగాణ పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలనే పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై తెలంగాణ పోలీస్ ప్రజలను అప్రమత్తం చేసింది. ఇటీవల బ్యాంక్ ఖాతాలు, వ్యక్తిగత సమాచారం లక్ష్యంగా నకిలీ సందేశాలు పంపిస్తూ మోసగాళ్లు ప్రజలను మభ్యపెడుతున్నారని పోలీసులు హెచ్చరించారు. ఆధార్ అప్‌డేట్ చేయాల్సిందిగా తెలియజేస్తూ వచ్చే లింకులు, సందేశాలు ఎక్కువగా నకిలీవేనని స్పష్టం చేశారు. అలాంటి లింకులపై క్లిక్ చేయడం ద్వారా మొబైల్ ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని, బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కాజేసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఆధార్ అప్‌డేట్ కోసం పంపినట్లు చెప్పే లింకులు, మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు. ఆధార్ అప్‌డేట్‌కు సంబంధించిన పనులు కేవలం అధికారిక కేంద్రాలు లేదా ప్రభుత్వ ధృవీకృత వెబ్‌సైట్ల ద్వారానే జరుగుతాయని పోలీసులు తెలిపారు. వ్యక్తిగత వివరాలు, ఆధార్ సంఖ్య, బ్యాంక్ వివరాలు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలపై విశ్వాసం పెట్టకూడదని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద సందేశాలు లేదా కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలంగాణ పోలీసులు కోరారు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉండటమే ఉత్తమ రక్షణ అని పేర్కొన్నారు.




# మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల నోటిఫికేషన్

- 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లకు వార్డులు, పదవుల కేటాయింపు
- బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారం బీసీలకు సీట్లు
- మున్సిపాలిటీల్లో 31.4%, కార్పొరేషన్లలో 30% బీసీలకు కేటాయింపు
- 38 మున్సిపల్ చైర్మన్ పదవులు బీసీలకు.. 10 కార్పొరేషన్లలో 3 మేయర్ పదవులు రిజర్వు
- బీసీ మహిళలకు చైర్మన్, మేయర్ పదవుల్లో సమాన ప్రాధాన్యం.. జీవో నంబర్ 14 విడుదల

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించి వార్డుల రిజర్వేషన్లు, చైర్‌పర్సన్, మేయర్ల పదవుల రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, మహిళల వారీగా వార్డులు, డివిజన్లు, చైర్మన్, మేయర్ పదవులు ఏ కేటగిరీకి ఎన్ని దక్కుతాయో వెల్లడించింది. రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లకు సంబంధించి పురపాలక శాఖ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి బుధవారం జీవో నంబర్ 14 జారీ చేశారు.

మిగతా 2లో..






## పతంగిని ఎగరేసిన హైడ్రా కమిషనర్

- కూకట్‌పల్లిలో ఘనంగా కైట్ ఫెస్టివల్
- చెరువుల అభివృద్ధి అంటే ఇలా ఉండాలని నిరూపణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): కూకట్పల్లి నల్లచెరువులో బుధవారం పండగ వాతావరణం నెలకొంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పతంగిని ఎగరవేయడంతో అక్కడి వాతావరణం ఉత్సాహంతో నిండింది. బాల్యం, యువకాళం జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పిల్లలు, యువకులతో కలిసి ఆయన పతంగిని ఎగరవేశారు. స్థానికుల ఆహ్వానం మేరకు నల్లచెరువు చెంత నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో కమిషనర్ పాల్గొన్నారు.

మిగతా 2లో..

## కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ఆగ్రహం

- ఎన్‌టీవీ జర్నలిస్టుల అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ట్వీట్
- కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తోందని వ్యాఖ్య
- జర్నలిస్టులను నేరస్తుల్లా చూడటం దురదృష్టకరం
- నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాల్సిందని సూచన



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): కథనానికి సంబంధించిన కేసులో హైదరాబాద్ పోలీసులు ముగ్గురు ఎన్టీవీ జర్నలిస్టులను అరెస్టు చేశారు. ఈ అక్రమ అరెస్టులను మాజీ మంత్రి కేటీఆర్ ఖండించారు. జర్నలిస్టుల అరెస్టుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలన ప్రతిసారీ ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తోంది.జర్నలిస్టులను నేరస్తుల్లా చూడటం దురదృష్టకరం. నోటీసులు ఇచ్చి విచారణకు పిలవచ్చు కదా?. అర్ధరాత్రి ఇళ్లల్లోకి వెళ్లి అతిగా ప్రవర్తించడం సరికాదు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలి'అని ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణలో ముగ్గురు జర్నలిస్టులను అత్యంత అమానవీయ పద్ధతిలో, చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేయడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

## 'జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కార్ తీరు అనైతికం'

- జర్నలిస్టుల అరెస్టుపై కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- నోటీసులు లేకుండా అరెస్టులు దుర్మార్గమని మండిపాటు
- ఎన్‌టీవీ జర్నలిస్టుల అరెస్టును ప్రశ్నించిన కేంద్రమంత్రి
- విచారణ లేకుండా చర్యలు సరికాదని వ్యాఖ్య
- మీడియాను బెదిరించొద్దని పోలీసులకు హితవు
- అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలన్న కిషన్‌రెడ్డి
- అర్ధరాత్రి అరెస్టులు తగవు: బండి సంజయ్



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కారు తీరు అనైతికమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నోటీసుల ఇవ్వకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఓ వార్తకు సంబంధించి ఎన్టీవీకి చెందిన పలువురు జర్నలిస్టులను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. విచారణ చేయకుండా చర్యలు తీసుకోవడం సరికాదని, జర్నలిస్టులను బెదిరించి భయపెట్టి చర్యలకు పాల్పడకూడదన్నారు.

మిగతా 2లో..

# దేవరకద్ర మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం

### సమగ్ర అభివృద్ధి దిశగా దేవరకద్ర ముందడుగు.. మంత్రి కోమటిరెడ్డి



దేవరకద్ర, (తెలంగాణ ముచ్చట్లు): దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని దేవరకద్ర మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, దేవరకద్రను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

మిగతా 2లో..

# సీఎం బహిరంగ సభ ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలి

### నిర్మల్ ఎన్టీఆర్ మినీ స్టేడియం పరిశీలించిన మంత్రి

### సభ విజయవంతానికి లోటుపాట్లు లేకుండా చర్యలు



నిర్మల్, (తెలంగాణ ముచ్చట్లు): ఈ నెల 16న నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ వార్డులు, డివిజన్లలో ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ స్థానాలు కేటాయించారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు, 2019 తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం జనరల్ మహిళలకు రిజర్వుడు స్థానాల సంఖ్యను ఖరారు చేశారు. బీసీలకు మున్సిపాలిటీల్లో 31.4 శాతం, కార్పొరేషన్లలో 30 శాతం సీట్లు రిజర్వు చేశారు. 121 మున్సిపాలిటీల్లో బీసీలకు 38 చైర్మన్ పదవులు రిజర్వు చేయగా, ఇందులో బీసీ జనరల్‌కు 19, బీసీ మహిళకు 19 చొప్పున ఖరారయ్యాయి. 10 కార్పొరేషన్లకు గాను బీసీలకు మూడు మేయర్ పదవులు రిజర్వు చేయగా, ఇందులో బీసీ మహిళలకు ఒకటి, బీసీ జనరల్‌కు రెండు మేయర్ పదవులు దక్కనున్నాయి.

# ‘జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కార్ తీరు అనైతికం’

(మొదటి పేజీ తరువాయి)

అరెస్ట్ చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేవారు కిషన్‌రెడ్డి.

అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ సరికాదు బండి సంజయ్

ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం తగదన్నారు బీజేపీ ఎంపీ బండి సంజయ్. పోలీసులు చట్ట ప్రకారం నడుచుకోవాలన్నారు బండి సంజయ్





పోలీసుల తీరు సమర్థనీయం కాదు కొమ్మినేని

ఎన్టీవీకి చెందిన జర్నలిస్టులను అరెస్ట్ చేసే వ్యవహారంలో పోలీసుల తీరు సమర్థనీయం కాదన్నారు రాజకీయ విశ్లేషకులు కొమ్మినేని శ్రీనివాసరావు. సోదాల పేరుతో మీడియా సంస్థలన ఇబ్బంది పెట్టొద్దన్నారు కొమ్మినేని.

జర్నలిస్టుల అరెస్టును ఖండిస్తున్నాం: పల్లా

జర్నలిస్టుల అరెస్టను బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఖండించారు. అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి జర్నలిస్టులన అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ సర్కార చర్యలు ఎమెర్జెన్సీని తలపిస్తున్నాయని, అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు పల్లా.





# మేడారం సమ్మక్క – సారలమ్మ మహాజాతరకు సర్వం సిద్ధం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు
- ఈసారి మూడు కోట్ల మందికి పైగా రాక అంచనా
- మంత్రి సీతక్క

**ములుగు, జనవరి 14 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** మేడారంలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. జాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని, తల్లీ దేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని ఆమె వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఈసారి మహాజాతరకు సుమారు మూడు కోట్ల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రవాణా, భద్రత, వైద్య సేవలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి అన్ని అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జాతరను సజావుగా నిర్వహిస్తున్నాయని అన్నారు.

మహాజాతర నిర్వహణకు మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించామని మంత్రి తెలిపారు. వీరితో పాటు 2,000 మంది గిరిజన యువ వాలంటీర్లు కూడా భక్తులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భక్తులకు మార్గనిర్దేశం చేయడం, రద్దీ నియంత్రణ, అత్యవసర సహాయం అందించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించనున్నారని వివరించారు.

గిరిజన సంప్రదాయాలు, ఆచారాలకు ప్రతీకగా నిలిచిన సమ్మక్క-సారలమ్మ మహాజాతరను భక్తి శ్రద్ధలతో, క్రమబద్ధంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. తల్లీ దేవతల జాతరకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆమె తెలిపారు.

# శనిగరం చెరువులో రొయ్యపిల్లల విడుదల

- మత్స్యకారుల ఆదాయాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- 100 శాతం రాయితీతో స్టేట్ సెక్టార్ పథకం అమలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**సిద్దిపేట, (తెలంగాణ ముచ్చట్లు):** మత్స్య అభివృద్ధి మరియు స్టేట్ సెక్టార్ పథకం కింద 100 శాతం రాయితీపై శనిగరం చెరువులో రొయ్యపిల్లలను విడుదల చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారుల ఆదాయం పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, చెరువులు, జలాశయాలను సద్వినియోగం చేసుకొని మత్స్య ఉత్పత్తిని పెంచడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రొయ్యల పెంపకం ద్వారా మత్స్యకారులకు తక్కువ సమయంలో మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. మత్స్య సొసైటీ నాయకులు, సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ముఖ్య నేతలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పథకాల ద్వారా చెరువుల అభివృద్ధి, మత్స్య సంపద పెంపుదల, ఉపాధి అవకాశాల సృష్టికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



# దేవరకద్ర మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

(మొదటి పేజీ తరువాయి)

నాణ్యమైన రహదారుల నిర్మాణం, సమర్థవంతమైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు, ప్రజావసరాలకు అనుగుణమైన మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గేలా ప్రణాళికాబద్ధంగా డ్రైనేజ్ పనులు చేపడుతున్నామని, రాకపోకలకు ఆటంకం లేకుండా రహదారులను ఆధునికీకరిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే దేవరకద్ర మున్సిపాలిటీ రూపురేఖలు పూర్తిగా మారతాయని అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. దేవరకద్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.



# సీఎం బహిరంగ సభ ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాటు, భద్రత, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. సభ విజయవంతానికి ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యం, భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటు, వృద్ధులు-మహిళలకు ప్రత్యేక సౌకర్యాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అధికారులు భరోసా ఇచ్చారు.

# మహిళలపై వ్యక్తిత్వ దాడులు అంగీకారయోగ్యం కాదు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాజీవితంలో విమర్శలు సహజమే అయినా, అదే పేరుతో మహిళలపై వ్యక్తిత్వ దాడులు చేయడం తీవ్రమైన తప్పిదమని తెలంగాణ పోలీస్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. మహిళ ప్రభుత్వ అధికారి అయినా, ప్రైవేట్ రంగంలో పని చేసే వృత్తిపరమైన మహిళ అయినా, గృహిణి అయినా——వారిపై మాటల ద్వారా, మీడియా కథనాల ద్వారా లేదా సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేయడం విమర్శ కాదని, అది నిస్సందేహంగా క్రూరత్వమేనని ఆయన పేర్కొన్నారు.

నేటి సమాజంలో మహిళలు పరిపాలన, పోలీసు వ్యవస్థ, పాలన, శాస్త్ర సాంకేతిక రంగం, ప్రజాజీవితం, మీడియా వంటి అనేక రంగాల్లో ముందుండి నాయకత్వం వహిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. అంతేకాదు, ఇంటి బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహిస్తూ, ఉద్యోగం, కుటుంబం, సమాజం మధ్య సమతుల్యత సాధిస్తున్నారని అన్నారు. అలాంటి మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం అంటే మనం గర్వపడే సామాజిక పురోగతినే దెబ్బతీయడమేనని అభిప్రాయపడ్డారు. మన ప్రాచీన సంస్కృతి మహిళల గౌరవానికి ఉన్న విలువను స్పష్టంగా చెబుతుందని ఆయన గుర్తు చేశారు. “యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః” అనే శాస్త్రవాక్యాన్ని ఉటంకిస్తూ, మహిళలను గౌరవించే చోటే దైవత్వం నివసిస్తుందని వివరించారు. మహిళల పట్ల గౌరవభావం లేకపోతే సమాజం ముందుకు సాగలేదని అన్నారు.

ఇటీవల కొంతమంది మహిళా అధికారులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని సజ్జనార్ తెలిపారు. మహిళలను గౌరవించలేని సమాజం తన భవిష్యత్తునే బలహీనపరుచుకుంటుందని హెచ్చరించారు. మహిళలపై అవమానం, పక్షపాతం, వ్యక్తిత్వ దాడులను సమాజం ఏ మాత్రం సహించదని స్పష్టం చేస్తూ, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదేనని ఆయన వ్యాఖ్యానించారు.

# పతంగిని ఎగరేసిన హైడ్రా కమిషనర్



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 సెప్టెంబరులో నల్లచెరువు విస్తరణ పనులు ప్రారంభించినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని గుర్తు చేశారు. నేడు అదే ప్రదేశంలో పండగ వాతావరణం నెలకొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అక్రమ కబ్జాలతో 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్లచెరువును 30 ఎకరాలకు విస్తరించామని తెలిపారు. 10 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువును మురికి నుంచి విముక్తం చేశామని చెప్పారు.

చెరువు లోతు పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరదలకు నియంత్రణ సాధిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం పై మెరుగులు దిద్దడం కాకుండా, చెరువుల అభివృద్ధి అంటే ఇలాగే ఉండాలని నిరూపించామని అన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, మరిన్ని అందాలు సమకూరుస్తున్నామని తెలిపారు. ఐదు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి వాకింగ్ చేస్తున్నామని పలువురు చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. నల్లచెరువు పరిధిలో షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ వంటి క్రీడా సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఇవన్నీ ప్రజలు ఉచితంగా వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు.

మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని కమిషనర్ వెల్లడించారు. హైడ్రా మొదటి విడతలో ఆరు చెరువుల అభివృద్ధి పూర్తయ్యిందని, ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని చెప్పారు. మరో మూడు చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. వీటికి తోడు ప్రభుత్వం నిర్దేశించిన మరో 14 చెరువుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. నగరంలో వంద చెరువులు అభివృద్ధి అయితే వరదల సమస్యను చాలా వరకు నియంత్రించవచ్చని అభిప్రాయపడ్డారు.

మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చడం ద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, మంచి నీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. చెరువులు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చెరువు ఈ స్థాయిలో అభివృద్ధి అవుతుందని ఊహించలేదని, ఇప్పుడు చూస్తే ఎంతో సంతృప్తిగా ఉందని స్థానికులు తెలిపారు. దుర్గంధభరితమైన వాతావరణాన్ని తొలగించి ఆహ్లాదాన్ని నింపిన హైడ్రాకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు, స్థానికులకు కమిషనర్ మిఠాయిలు పంచారు.






# తెలంగాణ ముచ్చట్లు క్యాలెండర్ ఆవిష్కరణ

- **సత్తుపల్లిలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ.**
- **ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రశంసలు.**

**సత్తుపల్లి, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకొస్తూ ప్రజలకు -ప్రభుత్వానికి మధ్య వారధిగా తెలంగాణ ముచ్చట్లు దిన పత్రిక నిలుస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు. బుధవారం సత్తుపల్లిలో తెలంగాణ ముచ్చట్లు నూతన సంవత్సర (2026) క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, సత్తుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి సంయుక్తంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అణగారిన వర్గాల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న పత్రికగా తెలంగాణ ముచ్చట్లు ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పత్రిక చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. నూతన సంవత్సరంలో పత్రిక మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

సీఐ తుమ్మలపల్లి శ్రీహరి మాట్లాడుతూ, చట్టం, శాంతిభద్రతల పరిరక్షణలో పత్రిక అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. బాధ్యతాయుత జర్నలిజంతో సమాజంలో అవగాహన పెంపొందిస్తోందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షుడు ఎస్. కేశవరెడ్డి, కార్యదర్శి ఏఎస్. ప్రకాశరావులకు పత్రిక ప్రతినిధులు క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వెలుగులోకి రాని అనేక సామాజిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో తెలంగాణ ముచ్చట్లు కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు వార్తల సేకరణలో పత్రిక ప్రతినిధుల కృషి ప్రశంసనీయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ అద్దంకి వెంకటరత్నం, అధ్యక్షులు రామిశెట్టి సుబ్బారావు, సాంబశివరెడ్డి, బూరుగు దాసు, మధుసూదన రాజు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ ముచ్చట్లు రిపోర్టర్ గోదా నాగబాబు, ఇతర పత్రికల రిపోర్టర్లు రామారావు, జంగం కిరణ్ కుమార్, హరిబాబు, మహేశ్, సాయి, సిబ్బంది మరియు స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.








# సంక్రాంతి ముగ్గుల పోటీలతో అమ్మపల్లి గ్రామంలో పండుగ కళ

**పెద్దమందడి,జనవరి14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులతో గ్రామాన్ని పండుగ శోభతో నింపారు.ఈ కార్యక్రమంలో అమ్మపల్లి గ్రామ సర్పంచ్ గౌని మాధవి, వెంకటేశ్వర్ రెడ్డి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అంతేకాకుండా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సాధారణ ప్రోత్సాహక బహుమతులు అందజేసి మహిళలను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు నాయక్ , వార్డు సభ్యులు శ్వేత, వరలక్ష్మి , పద్మ ఉద్య నాయక్ , చంద్రశేఖర్ పాల్గొన్నారు.అలాగే మాజీ సర్పంచ్ రమేష్ మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు గారు, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# పతంగులను పంపిణీ చేసిన కార్పొరేటర్ ప్రభుదాస్

**కాప్రా, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిన్నారుల్లో ఆనందాన్ని నింపే ఉద్దేశంతో అన్నపూర్ణ కాలనీలో బీఆర్ఎస్ నాయకులు రిజ్వాన్ ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ చిన్న పిల్లలకు గులాబీ రంగు పతంగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను చిన్నా-పెద్దా తేడా లేకుండా అందరూ సంతోషంగా జరుపుకోవడం ఆనందకరమన్నారు. పతంగులు ఎగరవేసే సమయంలో పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, భవనాలపైకి ఎక్కి పతంగులు ఎగరవేసేటప్పుడు విద్యుత్ తీగలను గమనించాలని సూచించారు. అలాగే చైనా మంజా వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పాండాల నరసింహ గౌడ్, సెక్రెటరీ సంజయ్ నాయక్, నాగి ముదిరాజ్, జావేద్, సాయి, అజీజ్, నవీన్ గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శోభన్ బాబు జయంతి వేడుకలు

**నాచారం, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** దివంగత సినీ నటుడు శోభన్ బాబు జయంతి వేడుకలను శోభన్ బాబు సేవా సమితి తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎమ్మెస్సార్ వర్మ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోతె శోభన్ రెడ్డి హాజరై, శోభన్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు .ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, తెలుగు సినీ పరిశ్రమకు శోభన్ బాబు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పద్మారావు, ప్రధాన కార్యదర్శి బి.లాల్ బహుదూర్ శాస్త్రి, రామకృష్ణ గంగాధర్, అశోక్, రమణ, ప్రతాప్ రెడ్డి, నరసింగ్ రావు, ప్రేమలత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఖండాంతరాల్లో సిపిఐ వందేళ్ల పండుగ




**ఖమ్మం బ్యూరో, జనవరి 14(తెలంగాణ ముచ్చట్లు):** సిపిఐ శతాబ్ది ఉత్సవాలు భారతదేశంలోనే కాకుండా ఖండాంతారాల్లో సైతం జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన కమ్యూనిస్టు పార్టీ కుటుంబాలకు చెందిన వారు అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో నివసిస్తున్న యువకులు సిపిఐ శతాబ్ది సంబురాలను జరుపుతున్నారు. వామపక్ష భావాజాలం కలిగిన యువకులు ఒక చోట పార్టీ చరిత్రను మననం చేసుకుంటూ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ మరింత పురోగమించాలని ఆశాభావం వ్యక్తం చేస్తూ శతాబ్ది ఉత్సవ శుభాకాంక్షలను తెలియజేసుకుంటున్నారు. సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా తనయుడు లతీఫ్ పాషా నేతృత్వంలో లండన్లో సిపిఐ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఇతర దేశాల్లో కూడా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తూ రానున్న కాలంలో కమ్యూనిస్టులు పురోగమించాలని కమ్యూనిజం మాత్రమే సరైన ప్రత్యామ్నాయం అని విద్యావంతులు చాటిచెబుతున్నారు.

# శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి



- **పుటాని తండాలో విస్తృత ప్రచారం**
- **సిపిఐ నాయకులు బానోతు నాగేశ్వరరావు**

**ఖమ్మం బ్యూరో, జనవరి 14(తెలంగాణ ముచ్చట్లు):** రఘునాథపాలెం మండల పరిధిలోని పుటానీ తండ గ్రామపంచాయతీలో సిపిఐ 100వ శతాబ్ది ఉత్సాహాలను గ్రామ ప్రజలు సిపిఐ సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ పోస్టర్లతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ... పుటాని తండలో సిపిఐ సానుభూతిపరులు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వందేళ్ళ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ప్రజలను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినప్పటి నుండి అనేక ఉద్యమాలు రైతులు, కార్మికులు కోసం పోరాటాలు చేసిందని వారు తెలియజేశారు. ఆరోజున బైక్ ర్యాలీతో వచ్చే వారు ముందుగా సంప్రదించాలని ఆయన కోరారు. ఈనెల 18న ఖమ్మంలోని ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలను హాజరు కావాలని సభను జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, బానోత్ కిషన్, బానోతు లక్కా, బానోతు లక్ష్మ, నునావత్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# 17 న సాయుధ పోరాట అమరుల సంస్మరణ సభ




- **మచ్చా వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ**
- **విలేకరుల సమావేశంలో మచ్చా విద్యాసాగర్**

**ఖమ్మం బ్యూరో ,జనవరి 14(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ అమరులు మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి ల 77వ సంస్మరణ సభ ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు మచ్చా విద్యాసాగర్ తెలిపారు.

ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సమ సమాజ నిర్మాణం కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1949 జనవరి 17న ఆనాడు నెహ్రూ సైన్యం కాల్చి చంపారని, ఈ పోరాటంలో మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి లు అమరులు అయ్యారని తెలిపారు. వారి జ్ఞాపకార్థం 77వ సంస్మరణ సభ ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ త రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏపీ అధికార ప్రతినిధి ఐఎఫ్ టు ప్రసాద్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మచ్చ సూర్యనారాయణ , చావా రమేష్, దురుసోజు రమేష్ తో పాటు అనేక మంది అతిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఎన్ తిర్మల్ చే రచించిన మచ్చ వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గోకనపల్లిలో జరిగే సంస్మరణ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో మోడెం వెంకన్న, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మచ్చ సూర్యనారాయణ, అడ్వకేట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోతో పతంగుల పంపిణీ







◆ **ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబురాలు**

**ఉప్పల్, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సంబురాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎన్ఎస్‌యూఐ నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల నుంచి విశేష స్పందనను పొందింది. బుధవారం హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని యువకులు, బాలల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోతో ప్రత్యేకంగా పతంగులను ఎన్ఎస్‌యూఐ ఉప్పల్ అధ్యక్షులు కిషోర్ తయారు చేయించారు. ఈ పతంగులను పరమేశ్వర్ రెడ్డి ఇందిరా నగర్ ప్రాంతంలో పిల్లలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సంప్రదాయ పండుగల ద్వారా యువతను, పిల్లలను ఐక్యం చేయడం ఆనందకరమని అన్నారు. సంక్రాంతి వంటి పండుగలు సాంస్కృతిక విలువలను కాపాడుతూ సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌బి కాలనీ డివిజన్ అధ్యక్షులు పోలేపక అంజయ్య, ఎన్ఎస్‌యూఐ ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షులు కిషోర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, ఉదయ్ కిరణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, సీనియర్ నాయకులు మల్లికార్జున్, పి.జన్ని, జగదేశ్, రమేష్, మోసాలి శ్రీనివాస్, నరేందర్, నవీన్, సురేష్, అంజయ్య, జెమినీ, ఇంజనీర్ మల్లేష్, సుధాకర్, అఖిల్, నిక్కీ, బాలకృష్ణ, మహిళా నాయకురాలు రాణి, ఎన్ఎస్‌యూఐ నాయకులు గణేష్, కృష్ణ, ఆకాష్, గ్యానేశ్వర్, తరుణ్, హరి, సుమంత్, సాయి, నరేష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



◆ **కార్పోరేటర్ ప్రభుదాస్**

**కాప్రా, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ ఎక్స్టెన్షన్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ కాలనీకి సంబంధించిన ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. కాలనీ అభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మాచర్ల నర్సింహ, కార్యదర్శి పావని, మల్లేష్‌గౌడ్, పూసల బ్రహ్మచారి, కనకరాజు, స్వయంప్రకాష్, శ్రీను, నవీన్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత బలోపేతంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం





◆ **మద్దిగట్ల సర్పంచ్ మేకల రాములు యాదవ్**

**పెద్దమందడి,జనవరి14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల గ్రామంలో మంగళవారం మద్దిగట్ల అంబేద్కర్ పులే యువజన సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీలు మరియు వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మేకల రాములు యాదవ్ హాజరయ్యారు.ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మేకల రాములు యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలోని యువత అన్ని విధాలుగా బలోపేతం కావాలని, యువత చేసే సేవల ద్వారానే గ్రామానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. యువత పెద్దల సూచనలు, అనుభవాలను గౌరవిస్తూ, తమ ఆలోచనలను కూడా పంచుకుంటూ అందరితో కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.అంబేద్కర్ పులే యువజన సంఘం గ్రామాభివృద్ధికి ఎప్పటికీ కృషి చేస్తుందని పేర్కొంటూ, గతంలో పెద్దలు చేసిన సేవలను గుర్తుచేశారు.అనంతరం నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులను మరియు అంబేద్కర్ పులే యువజన సంఘం నూతన కమిటీని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి సాగర్, వార్డు సభ్యులు పాలెం రవి, బి. రాములు, బిలాయి నాగమ్మ, పెద్దలు డీలర్ నాగరాజు, బిలాయి నాగేంద్రం, రామగళ్ళ చంద్రయ్య, నత్తి మన్నెం, రామగల ఈశ్వర్, యువకులు ఆర్. శ్రీను, జుంపాల ప్రవీణ్, ఆర్. రాజశేఖర్, బి. సాయి, వరప్రసాద్, తుడుకుర్తి రాజు, నత్తి సాయి కిరణ్, బి. వెంకటేష్, కాలనీ యువకులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోదా రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం



**దమ్మాయిగూడ, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని సీతారామ నిలయం, పీఎస్ రావు నగర్, అయ్యప్ప కాలనీ, భోజనపల్లి ప్రాంతాల్లో బుధవారం గోదా రంగనాథ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.భోజనపల్లి శ్రీనివాసాచార్యులు, సుందరాచార్య స్వామి ఆధ్వర్యంలో ఈ కళ్యాణోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైదిక సంప్రదాయాలకు అనుగుణంగా ఘనంగా సాగింది. తొలుత ఎదుర్కోళ్ల ఘట్టాన్ని వైదిక మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం స్వామివారి కళ్యాణ ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కళ్యాణ సమయంలో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.దమ్మాయిగూడ, చీర్యాల, కీసర ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి మరింత వైభవాన్ని చేకూర్చారు.ఈ సందర్భంగా సుందరాచార్య స్వామి మాట్లాడుతూ ధనుర్మాసం భక్తి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే పవిత్ర కాలమని తెలిపారు. ఈ మాసంలో గోదాదేవి రంగనాథ స్వామిని వివాహం చేసుకోవాలనే సంకల్పంతో నిర్వహించే పూజలు భక్తుల కోరికలను నెరవేర్చుతాయని పేర్కొన్నారు.గోదా రంగనాథ స్వామివారి కళ్యాణ దర్శనం వల్ల కుటుంబాల్లో శాంతి, సుఖసంతోషాలు నెలకొంటాయని, సమాజంలో ధార్మిక భావనలు మరింత బలపడతాయని అన్నారు.ప్రతి ఒక్కరూ ధనుర్మాస ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# డ్రోన్ కెమెరాలతో కోడి పందాల గుర్తింపు





◆ **పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో సత్తుపల్లి సరిహద్దుల్లో దాడులు.**

**సత్తుపల్లి, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిషేధిత కోడి పందాలను అరికట్టేందుకు ఖమ్మం జిల్లా పోలీసులు డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నిఘా చేపట్టారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కోడి పందాలపై ప్రత్యేక దృష్టి సారించి, డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా పందాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి దాడులు నిర్వహిస్తున్నారు. సత్తుపల్లి సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ నిఘా బృందాలు ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తూ, కోడి పందాలు జరుగుతున్న స్థావరాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకుంటున్నాయి. పండుగ రోజుల్లో అక్రమ జూద కార్యకలాపాలు పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా కోడి పందాలు జరుగుతున్న ప్రాంతాలు, అక్కడ చేరుతున్న జనసమూహం, పందాల నిర్వాహకులను సులభంగా గుర్తించగలుగుతున్నామని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు. డ్రోన్ సాంకేతికతతో చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వేగంగా స్పందించగలుగుతున్నామని అన్నారు. కోడి పందాలు, పేకాట వంటి నిషేధిత కార్యకలాపాలను పూర్తిగా అరికట్టి శాంతిభద్రతలను కాపాడడమే పోలీసుల లక్ష్యమని తెలిపారు. డ్రోన్ నిఘా ద్వారా సేకరించిన సమాచారంతో దాడులు నిర్వహించి, పట్టుబడిన వారితో పాటు పందాలకు స్థలాలు కల్పించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ప్రజల సమస్యలపై మీడియా నిరంతరం పోరాటం చేయాలి



◆ **తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణలో మాజీ జడ్పిటిసి**

**పెద్దమందడి,జనవరి14(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్‌ను మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి బుధవారం వెల్టూర్ గ్రామంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత మీడియాపై ఉందని, ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పనిచేస్తోందని, ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలను పాలకులకు తెలియజేసే కీలక పాత్రను పోషిస్తోందని తెలిపారు. నిజ నిర్భయమైన వార్తలతో ప్రజల విశ్వాసాన్ని పొందిన పత్రికలే సమాజంలో నిలదొక్కుకుంటాయని అభిప్రాయపడ్డారు.తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, గ్రామీణ ప్రాంతాల అంశాలను నిరంతరం ప్రచురిస్తూ మంచి గుర్తింపు పొందిందని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ దండు అశోక్, మాజీ సర్పంచ్ బాలు చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు మల్లికార్జున్, నాగమణి నరేష్, రఘువర్ధన్ రెడ్డి, మల్లక్ సురేష్, మహేష్‌రెడ్డి, దయ్యాల నాగన్న, లాల్, జర్నలిస్టులు బండి రాజు, రాజశేఖర్ స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్సి సంస్థ ఉద్యోగులకు బహుమతులు అందజేసిన పరమేశ్వర్ రెడ్డి






**కాప్రా, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు-):** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా కాప్రాలోని సైన్టిఫిక్ రీసెర్చ్ అండ్ కమ్యూనిటీ (ఎస్ఆర్సి) సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎస్ఆర్సి సంస్థ ఉద్యోగుల వినోదం, మానసిక ఉల్లాసం కోసం క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, రంగోలీ (ముగ్గుల పోటీలు) వంటి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, వాటిలో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల్లో ఉత్సాహం, స్నేహభావం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. చిన్న వయసులోనే పారిశ్రామికవేత్తగా ఎదిగి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, రాజకీయ నాయకునిగా సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొంటున్న ఎస్ఆర్సి సంస్థ యజమాని తన్నీరు శ్రీహరి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. వారి సేవలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, ఎస్ఆర్సి సంస్థ ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్సి సంస్థ యజమాని తన్నీరు శ్రీహరి, మేనేజర్ శ్రీరాము పాల్గొన్నారు.అలాగే కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ జిల్లా ఏఎంసీ డైరెక్టర్ పూర్ణ యాదవ్, మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం యాదగిరి, టిల్లు యాదవ్, మల్లికార్జున్, కేఎల్ రావు, పడమటి మల్లారెడ్డి, పొట్టు బాబురావ్, నరేందర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, ఉప్పల వినోద్, రాకేష్ యాదవ్, జగదీష్, తోటకూర శ్రీకాంత్, మూర్తుజా, నాగరాజు యాదవ్, సతీష్ యాదవ్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఘోర బైక్ ప్రమాదం

- యువకుడు మృతి

**కీసర, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. భోగారం గ్రామానికి చెందిన గడ్డం కుమార్ (23) బుధవారం సాయంత్రం షామీర్పేట్ నుంచి భోగారం తన నివాసానికి బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, సర్వీస్ రోడ్డులోని స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో కుమార్ కొంత దూరం రోడ్డుపై జారిపోయాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న కీసర పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ప్రమాదానికి అధిక వేగం, స్పీడ్ బ్రేకర్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే కారణమని గుర్తించారు. స్థానికులు మాట్లాడుతూ, రాత్రి సమయంలో ఈ రోడ్డుపై సరిపడా వీధి దీపాలు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటన ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో రోడ్డు భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసులు సూచించారు. అలాగే రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ ఘటనపై సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ లక్ష్మణ్ వివరాలు వెల్లడించారు.




# కుషాయిగూడలో గోదా రంగమన్నార్ కల్యాణోత్సవం

**కుషాయిగూడ, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శ్రీ గోదా రంగమన్నార్ కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్సవమూర్తులను ప్రతిష్టించి, అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణ మహోత్సవం భక్తుల కనుల పండుగగా సాగింది.అర్చకులు రమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు, నారాయణాచార్యులు, లక్ష్మణాచార్యులు వేద మంత్రాల ఉచ్చారణతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు .ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ఉప్పల యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో మటమ్ వీరేశం పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు పల్లె శ్రీకాంత్ రెడ్డి, ఆలయ సిబ్బంది రామ్ నరేష్, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.అలాగే సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పంజలా శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీనారాయణ, భాష్య నాయక్, శ్రీకాంత్ రెడ్డి, సిద్దిపేట శ్రీనివాస్, మురళి పంతులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.








# ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- 18న జిల్లాకు రేవంత్ రెడ్డి రాక
- ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ, సీపీ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, జనవరి 14(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి పరిధిలో జరగనున్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల ప్రాంతాలను వారు సందర్శించారు.

ఈ సందర్భంగా ఇన్ చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాల సమీపంలో హెలిప్యాడ్‌ను డీజీసీఏ ప్రమాణాల మేరకు సిద్ధం చేయాలని, అక్కడ అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు.సీఎం కాన్వాయ్ కోసం అత్యుత్తమ వాహనాలను ఎంపిక చేయాలని, ప్రొటోకాల్ ప్రకారం ప్రత్యేక వైద్య బృందం,108వాహనాన్నివెంటఉంచాలని స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రికి వివరించేందుకు శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని జిల్లాలో పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీ సునీల్ దత్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఏ.శ్రీనివాస రెడ్డితో పాటు ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.






# విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి

**నాచారం, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** యువత ఉజ్జ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాచారం ఎస్ఐ మైబెల్లి, ఎన్డీఎఫ్ కన్వీనర్ నందికొండ శ్రీనివాస్ రెడ్డి, యాంటీ డ్రగ్ ఫోరం కన్వీనర్, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. నాచారం లోని మదర్సా సుఫ్ఫతుల్ ముస్లిమీన్ హాస్టల్ లో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితానికే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై కూడా తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, క్రమశిక్షణ, దేశ సేవ వైపు దృష్టి సారించాలని సూచించారు.యువతను మత్తు పదార్థాల ముప్పు నుంచి రక్షించి, ఆరోగ్యవంతమైన మరియు బాధ్యతాయుత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. గత డిసెంబర్ 31 మరియు జనవరి 6 తేదీల్లో నిర్వహించిన మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులు, యువతకు సీడీఎస్ బిల్డింగ్‌లో సర్టిఫికెట్లను ఘనంగా పంపిణీ చేశారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించిన సర్టిఫికెట్ల పంపిణీని రాబోయే రోజుల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాచారం పోలీస్ సిబ్బంది గుంటుక కృష్ణా రెడ్డి, మామిడాల రాజా రెడ్డి, మొహమ్మద్ ఫసియుద్దీన్, నమిలికొండ సునీల్ రెడ్డి, జావీద్, వాలి, షెరీఫుద్దీన్, రేవంత్, ఎస్ఎస్ఎస్ యువసేన కిషోర్ రెడ్డి, కరుణాకర్, శ్రీధర్, స్నేహిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.







# మల్లాపూర్‌లో సంక్రాంతి సంబరాలు

- నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘణంగా పతంగుల పంపిణీ
- ప్రత్యేక ఆకర్షణగా "పతంగుల బండి"

**మల్లాపూర్, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పతంగుల పంపిణి కార్యక్రమాన్ని ఘణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన "పతంగుల బండి" మల్లాపూర్ డివిజన్‌లో బస్తీబస్తీ తిరుగుతూ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. పతంగుల బండి రావడంతో చిన్నారులు ఆనందంతో కేరింతలు వేస్తూ పతంగులు తీసుకున్నారు. యువతీ యువకులు, పెద్దలు సైతం పతంగులు స్వీకరించి సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మల్లాపూర్ డివిజన్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పతంగులు ఎగరేసే సమయంలో చైనా మాంజా వాడకాన్ని పూర్తిగా నివారించి, ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. సంప్రదాయ పండుగలను భద్రతతో పాటు ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.జి. సుదర్శన్, బెల్లం గట్టయ్య, తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, దంతూరి రాజు గౌడ్, ముజీబ్, వుండం శ్రీనివాస్, జానీ, కోయలకొండ రాజేష్, మనోహర్, జానీ భాయ్, పర్వతాలు, కంపెల్లి శివ, నిక్కీ గౌడ్, లక్ష్మిపతి, మెహన్, నాగరాజ్, మహేష్, నరేష్ యాదవ్, శేఖర్, వరుణ్ రెడ్డి, దాసరి సాయి, డీజే దినేష్ పాల్గొన్నారు. అలాగే మహిళా నాయకురాళ్లు సోనీ గౌడ్, ఇష్రత్ బానో, ఇంతియాజ్‌తో పాటు మల్లాపూర్ యువ నాయకులు బాతరాజు రాహుల్, నెమలి సందీప్, వంగవీటి రింకు, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# రఘునాధపాలెం ప్రజల చిరకాల స్వప్నం సాకారవేళ..

- నాడు పాలేరు- నేడు మంచుకొండ
- రేపు సీతారామ తో జిల్లా జలకళ తుమ్మల లక్ష్యం
- సామాజిక వేత్త లోడిగ. వెంకన్నయాదవ్

**ఖమ్మం బ్యూరో, జనవరి 14(తెలంగాణ ముచ్చట్లు):** పాలేరు నుండి పర్ణశాల వరకు తుమ్మల చేసిన అభివృద్ధి ఉమ్మడి ఖమ్మం జిల్లా కు శ్రీరామరక్ష. దీనికి నిదర్శనం నాడు పాలేరు భక్త రామదాసు, నేడు పండితాపురం ఎత్తిపోతల పథకం రేపు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పదిలక్షల ఎకరాలకు సాగునీరు తర్వాత త్రాగు నీటికి శాశ్వత పరిష్కారం తుమ్మల లక్ష్యం. ఈ జిల్లాను జలకళ తో రైతాంగం మోహంలో చిరు నవ్వులతో ఆనందాన్ని చూడడం తుమ్మల ప్రదాన జీవిత కల. ఇది సాకారం కావడానికి ఎంతో దూరంలో లేదు అనే దానికి నిద్రర్శనం వారు ఈజిల్లాకోసం తపిస్తున్న తీరు చూసేవారికి ఆశ్చర్యం కలిగించక మానదు. ఏడుపదుల వయస్సులో నీటిని ఊరకలు వేయిస్తు పొలంలో కి వరదలు పరుగులు పెట్టిస్తున్న తీరు సీతారామ ప్రాజెక్ట్ పై రైతాంగంనకు నమ్మకం పెరింది. వ్యవసాయం ఆధారంగా రైతాంగం తో పాటు,వ్యవసాయ జీవనాధారంతో జీవిస్తున్న ప్రజలు మట్టివాసన ను ముద్దగా మలుచుకొని బ్రతుకుతున్న ఎందరికో తుమ్మల అపరభగీరధుడుగా, అభివృద్ధి ప్రదాత గా నామకర్ణకు భరోసా కల్పించారు. ఇది ఒక్కరోజులో వచ్చింది కాదు.దానికి ఐదుశదాబ్ధాల నిరంతర రాజకీయ పోరాట పటిమ పనితీరు నిద్రర్శనం కరువు కాటకాలతో సాగటానికి బొక్కెనడు నీళ్ళు,త్రాగటానికి గుక్కెడు నీరు లేక అలమటిస్తున్న పాలేరు రైతాంగ ప్రజలు గోస వర్ణనాతీతంగా ఉండేది. ఎగువన తిరుమనాయపాలెం మండలం దిగువున కూసుమంచి మండలం చెంతనే పాలేరు చెరువు ఉన్నా చింతతప్పని రైతాంగం కొరకు తుమ్మల ఆపత్బాంధవుడిలా పాలేరు వచ్చారు. పాలేరు ప్రజలకు ఒక ఆశ చిగురురించింది. దాని పరిష్కారమే భక్తరామదాసు ఎత్తిపోతల ద్వారా రూపకల్పన చేసి ,కూసుమంచి,తిరుమనాయపాలెం మండలం రైతుల మొహంలో చిరునవ్వులు చిందించిన ఘనత తుమ్మల నాగేశ్వరరావు గారిది అనేది నిజం. ఇది దేశంలోనే ఒక నూత ఒరవడిని సృష్టించిది అని చెప్పవచ్చు. వ్యవసాయ నీటిపారుదల రంగంలో ఒక మార్పు ను తీసుకువచ్చింది.. ఆలోచన వచ్చిందే తడువుగా ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ను ఒప్పించి భక్తరామదాసు ఎత్తిపోతల పథకం శంకుస్థాపన చేసి తొమ్మిది నెలలోనే పూర్తి చేసిన ఘనత తుమ్మలది. దిగువన ఉన్ననీటిని ఎగువకు పంపించి తిరుమనాయపాలెం, కూసుమంచి మండలాలలో ఉన్న చెరువులను నింపించి పాలేరు ప్రజల చేత శభాష్ అనిపించు కొన్నారు తుమ్మల.

ఇప్పుడు అదే తరహాలో నీటి ఎద్దడితో అలమటిస్తున్న ఖమ్మం నియోజకవర్గం రఘునాధపాలెం మండలం రైతాంగం చిరకాల స్వప్నం సాకారంచేయడాని సాగర్ జలాల ద్వార మంచుకొండ ఎత్తిపోతల ప్రాజెక్ట్ తల పెట్టి రఘునాధపాలెం మండలం లో నీటిని పరుగులు పెట్టించిన ఘనత తుమ్మల ది. నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి (నూటాఒక్కకోట్లు) 101 కోట్లు మంజూరు చేపించి కేవలం పన్నిండు నెలల కాలంలో పనులు పూర్తి చేసి సాగరు జలాలను మండలంలోని 37 గ్రామంచాయతి పరిధిలోని 36 చెరువులు నింపే బృహత్తర కార్యక్రమం చేపట్టిన తుమ్మల ఖమ్మం ప్రజల చేత శభాష్ అనిపించు కొన్నారు. గత సంక్రాంతి కి శంకుస్థాపన చేసి వచ్చే సంక్రాంతికి పూర్తి చేసి మీ పొలాలకు నీటిని మళ్ళిస్తా అని 12 నెలలలోనే పూర్తి చేసి అన్న మాట నిలబెట్టు కొన్నారుతుమ్మల . దీని ద్వారా సుమారు 3000 ఎకరాల భూమి సాగులోకి రావడం కాకుండా అడుగంటి పోయిన భూగర్భజలాలు పైకి ఉబికి తద్వారా నీటి లభ్యత పరోక్షంగా ప్రత్యేక్షంగా సాగు త్రాగు నీరు పుష్కలంగా చుట్టుపక్కల గ్రామాలకు లభిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు.ఇది తుమ్మల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుంది. అధికారంలో ఉన్న ప్రతిపక్షం లో ఉన్నా ఒక్కటే తుమ్మల జీవిత లక్ష్యం గా ఎంచుకొని అంకుటిత దీక్షతో పనిచేసిస్తున్న నాయకులు తుమ్మల నాగేశ్వరరావు. కృష్ణ జలాలు ఏకారణం చేతనైనా ఖమ్మం జిల్లాకు రాకపోయినా, ఆలస్యం అయినా, ఋతుపవనాలు రాక సకాలంలో వర్షాలు పడకపోయినా ఖమ్మం జిల్లా రైతాంగం నీటి ఎద్దడితో పంటపొలాలు దెబ్బతిని రైతులు నష్టపోకూడదు అన్నదే తుమ్మల అభిమతం. దానికి ఏకైక మార్గం గోదావరి జలాలను సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం మొహంలో చిరునవ్వులు చూడాలన్నదే తుమ్మల జీవిత లక్ష్యం. దిగువనుండి ఎగువకు మోటార్ సిస్టంతో పైపులద్వార, కాలువ ద్వార రిజర్వాయర్ లు నింపి దాని ద్వారా చెరువు కుంటలు నింపి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది లక్షల ఎకరాలు సస్యశ్యామలం చేసి ఖమ్మం జిల్లా జలకళ తో కళకళలాడుతూ ఉండాలని నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో సీతారామ ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశారు. 80 శాతం పనులు పూర్తి చేసి ఈ పదవీ కాలం లోపే తన కలసాకారం చేసి గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా రైతాంగం కాళ్ళు కడిగి తన జీవిత లక్ష్యం సాకారం చేసుకోవాలన్న కృతనిశ్చయంతో తుమ్మల పనిచేస్తున్నారు.ఈ లక్ష్యసాదనలో ప్రజలతో పాటు ఆ భద్రాచలం సీతారామ చంద్రమూర్తి ఆశీస్సులు తనకు కావాలి అని తరచు బహిరంగ సభలో ప్రజలకోరుకొంటారు.వారి జీవిత ఆశయం తనకోసం కాదు,తన కుటుంబం కోసం కాదు తనన్ని నమ్మి ఐదు శతాబ్దాలుగా రాజకీయాలలో నిలబెట్టి ఆశీర్వదించిన ప్రజలకు ఏదోఒకటి చెయ్యాలి అన్నతపన. తన తపన నాడు పాలేరు భక్త రామదాసు ప్రాజెక్ట్ అయినా నేడు పండితాపురం ఎత్తిపోతల ప్రాజెక్ట్ అయినా రేపు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా కు గోదావరి జలాలతో జలకళ సంతరించి ప్రతి చేనుకు నీరు ,ప్రతి చేతికి పని తో ప్రతీరైతు మొహంలో ఆనందం చూడాలన్న ఏకైక లక్ష్యం తుమ్మల ది వారి అంకుటిత దీక్ష జీవిత కల,ఖమ్మం జిల్లా జలకళ తో కళకళలాడలని త్వరలోనే నెరవేరాలని ఆశిద్దాం...

# సంక్రాంతి శోభను చాటిన మణిగిల్ల గ్రామ ముగ్గుల పోటీలు



**పెద్దమందడి,జనవరి14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో భోగి పండుగ శుభ సందర్భంగా గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, గ్రామ పెద్ద అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా రంగురంగుల ముగ్గులు వేశారు.తరతరాలుగా వస్తున్న సంక్రాంతి సంప్రదాయాన్ని కళ్లకు కట్టినట్లు ముగ్గులు వేయడంతో గ్రామం పండుగ వాతావరణంతో కళకళలాడింది. జూనియర్స్ విభాగం ముగ్గుల పోటీలు గ్రామంలోని శివాలయం వద్ద, సీనియర్స్ విభాగం పోటీలు స్వామి వివేకానంద స్టార్చ్ సమీపంలో నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను రేపు మకర సంక్రాంతి రోజున చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్‌తో పాటు గ్రామ ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్‌కుమార్, అనిల్ కుమార్ రెడ్డి, ఎస్. రాములు, పోతుల రామ్ రెడ్డి, పోతుల ప్రతాప్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి రాజు, గొంది రామకృష్ణారెడ్డి, పలుస శేఖర్ గౌడ్, పలుస సంఘమేశ్వర్ గౌడ్, సుంచర్ మోని వెంకటయ్య, మండల దశరథం, బోయిని కృష్ణయ్య, ఆనంద్ కుమార్ రెడ్డి, కావలి శివశంకర్, ప్రేమ్ కుమార్ రెడ్డి, ఉప్పరి రాఘవేంద్ర, సింగం వెంకటయ్య, బోయిని గణేష్, సుంచర్ మోని అశోక్, గొల్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గుల పోటీలను విజయవంతం చేయగా, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్‌కు మరియు గ్రామ పెద్ద అనిల్ కుమార్ రెడ్డికి గ్రామ పెద్దలు, యువత అభినందనలు తెలియజేశారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేసిన కార్పొరేటర్ బన్నాల గీతా



**చిల్కానగర్, జనవరి (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణపురి ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, కాలనీ అధ్యక్షుడు ముద్దం శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి మల్లికార్జున్, బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారని ప్రశంసించారు. బస్తీ వాసులు, ముఖ్యంగా చిన్నారులు వేసిన ముగ్గులు సాంప్రదాయబద్ధంగా, ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు. మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి సానుకూల సందేశాన్ని ఇస్తాయని, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించడంతో పాటు మహిళలకు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.ముగ్గుల పోటీల్లో అనేక మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులతో అందరినీ ఆకట్టుకున్నారని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయడం ఆనందంగా ఉందని పేర్కొంటూ, బస్తీ వాసులకు ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రఫీ, సంజీవ్ శ్యామ్, బాలు, అలాగే బస్తీ వాసులు శ్రీకాంత్, బాలయ్య, మధు తదితరులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







# సంక్రాంతి ముగ్గుల పోటీల్లో వెల్టూర్ గ్రామంలో మహిళలకు ప్రోత్సాహం

**పెద్దమందడి,జనవరి14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. మహిళలు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే విధంగా అందమైన ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మూడవ బహుమతి విజేతకు జి .సతీష్ చేతుల మీదుగా అలాగే బుసయ్య చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి అందజేయడం జరిగింది. మహిళల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడేలా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# సంక్రాంతి ముగ్గుల పోటీల్లో వెల్టూర్ గ్రామంలో మహిళల ప్రతిభకు ఘన సత్కారం

- విజేతలకు ప్రోత్సాహ బహుమతులు అందజేత

**పెద్దమందడి,జనవరి14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు తమ సృజనాత్మకతతో రంగురంగుల ముగ్గులు వేసి గ్రామాన్ని పండుగ వాతావరణంతో నింపారు.ఈ పోటీల్లో మొదటి బహుమతి విజేతగా నిలిచిన బోయ అనితకు గ్రామ సర్పంచ్ దండు అశోక్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి అందజేశారు. రెండవ బహుమతి విజేత కుమ్మరి లక్ష్మికి బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు రమేష్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దండు అశోక్ విజేతలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మహిళల్లో ఉన్న కళా ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శాఖ వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ నాగమణి నరేష్,రఘువర్ధన్ రెడ్డి, వివేకానంద,జి సతీష్, బుసయ్య , మహేష్ కోట కదరా సత్తా రెడ్డి, నాగన్న, అనంత రెడ్డి,గ్రామ పురుహితులు శ్రీనివాస్ శర్మ, శ్రీకాంత్ శర్మ.బాల శివుడు, శివానంద ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# విమానాశ్రయంలో బహుళ శాఖల మాక్ డ్రిల్

- **ఉగ్రవాద ప్రతిఘటన ప్రణాళిక ఆధారంగా భద్రతా విన్యాసం**
- **భద్రతా బలగాల సమన్వయం, సిద్ధతకు పరీక్ష**

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుత భద్రతా పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని జబల్‌పూర్ విమానాశ్రయంలో వార్షిక బహుళ శాఖల మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద ముప్పు ఎదురైన సందర్భాల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం, స్పందన సామర్థ్యం, సిద్ధతను అంచనా వేసే లక్ష్యంతో ఈ విన్యాసాన్ని చేపట్టారు. విమానాశ్రయ భద్రత మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఈ డ్రిల్ కొనసాగింది.

విమానాశ్రయ టెర్మినల్ భవనంపై ఉగ్రదాడి ప్రయత్నం జరిగినట్లు ఊహాజనిత పరిస్థితిని సృష్టించి ఈ విన్యాసాన్ని నిర్వహించారు. భద్రతా సిబ్బంది తక్షణమే అప్రమత్తమై పరిస్థితిని నియంత్రించే చర్యలు చేపట్టారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రమాదకర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్నదానిపై కార్యాచరణను ప్రదర్శించారు. ఈ మాక్ డ్రిల్‌లో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బందితో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్ర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రాంతాన్ని సురక్షితంగా మార్చడం, ప్రజలను రక్షించడం వంటి అంశాల్లో ఇరు శాఖలు సమన్వయంతో పనిచేశాయి. వేగవంతమైన స్పందన, క్రమబద్ధమైన నిర్వహణ ఈ విన్యాసంలో ప్రధానంగా కనిపించాయి.

భవిష్యత్తులో ఎదురయ్యే ఏవైనా భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇలాంటి మాక్ డ్రిల్లులు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. విమానాశ్రయాల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా ఈ తరహా విన్యాసాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# రఫేల్ తయారీ వేగంపై సందేహాలు

- **ఉత్పత్తి పెంచకపోతే భారత్‌కు దీర్ఘ నిరీక్షణ**
- **భారీ ఆర్డర్లతో పెరుగుతున్న డెలివరీ ఆలస్యం**

**పారిస్ / న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):** ఫ్రాన్స్‌కు చెందిన యుద్ధ విమాన తయారీ సంస్థ డసాల్ట్ ఏవియేషన్ రఫేల్ యుద్ధ విమానాల తయారీ వేగం ఇప్పుడు రక్షణ రంగంలో చర్చకు దారి తీసింది. 2025 సంవత్సరంలో సంస్థ 26 రఫేల్ యుద్ధ విమానాలను సరఫరా చేయగా, ఇది ఇప్పటివరకు అత్యధిక వార్షిక సంఖ్యగా నమోదైంది. అయినప్పటికీ, పెరుగుతున్న ఆర్డర్లు, పెండింగ్ సరఫరాల కారణంగా ప్రస్తుత తయారీ సామర్థ్యం సరిపోతుందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



2025 చివరికి డసాల్ట్ వద్ద సుమారు 220 రఫేల్ యుద్ధ విమానాల సరఫరా పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా. దీనికి తోడు భారత్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఆర్డర్ వస్తే, మొత్తం పెండింగ్ సంఖ్య సుమారు 334కు చేరనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న తయారీ వేగంతో ఈ మొత్తం విమానాలను సరఫరా చేయడానికి పదేళ్లకు మించిన కాలం పట్టే అవకాశముందని రక్షణ విశ్లేషకులు చెబుతున్నారు.

ఈ లెక్కన చూస్తే, భారత్ ఆర్డర్ చేసే రఫేల్ యుద్ధ విమానాల్లో చివరి విమానం 2036 ప్రాంతంలోనే అందే పరిస్థితి ఏర్పడవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది భారత వైమానిక దళం ఆధునికీకరణ ప్రణాళికలపై ప్రభావం చూపే అంశంగా మారవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రాంతీయ భద్రతా సవాళ్లు పెరుగుతున్న సమయంలో, యుద్ధ విమానాల సమయానుకూల సరఫరా అత్యంత కీలకమని వారు సూచిస్తున్నారు.

డసాల్ట్ తయారీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచకపోతే, భవిష్యత్తులో వచ్చే ఆర్డర్ల సరఫరాలో భారీ ఆలస్యం తప్పదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. కొత్త తయారీ లైన్లు, భాగస్వామ్య దేశాల్లో అసెంబ్లీ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రఫేల్ యుద్ధ విమానాలపై భారత్ పెట్టుకున్న ఆశలు నెరవేరాలంటే, తయారీ వేగంలో పెద్ద మార్పు తప్పనిసరి అనే అభిప్రాయం బలపడుతోంది.

# రోడ్డు ప్రమాదంలో పాల వ్యాపారి మృతి





- **న్యాయం చేయాలంటూ రోడ్ పై బైటయించిన కుటుంబ సభ్యులు,గ్రామస్తులు.**
- **రెండు గంటల పాటు ఎన్ హెచ్ 563 హైవేపై రాకపోకలకు అంతరాయం.**

**హసన్ పర్తి,జనవరి 14 ( తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కేశవపూర్ గ్రామానికి చెందిన పాల వ్యాపారి ఈర కుశుడు (35) బుధవారం రోజున జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మరణించినట్లు హసన్ పర్తి పోలీసులు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే మృతుడు వ్యాపారంలో భాగంగా ఉదయం 5:30 గంటలకు పాలు తీసుకొని టీఎస్ 03ఈఎక్స్ 8120 నంబరు గల ద్విచక్ర వాహనంపై తన సొంత గ్రామమైన కేశపూర్ నుండి హనుమకొండకు వెళ్తుండగా మార్గ మధ్యలో సుమారు ఉదయం 6 గంటలకు హసన్ పర్తి గ్రామ శివారులో గల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న బ్రిడ్జి దాటుతుండగా సీతంపేట గ్రామం వైపు నుండి నిర్మాణ దశలో ఉన్న సర్వీసు రోడ్డు నుండి ఆర్ జె 04జీసీ 3349 నంబరు గల టిప్పర్ ను డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ మోటార్ సైకిల్ ను ఢీకొట్టడంతో అట్టి లారీ టైర్ల కింద పడి నడుము నుండి తల వరకు శరీరం అంతా నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మరణించినట్లు మృతుడికి భార్య 3 పిల్లలు ఉన్నారని తెలిపారు. టిప్పర్ ను నడిపిన డ్రైవర్ సాహిల్ ఆలం తండ్రి సాగిర్ దేవన్ బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య ఈర స్నేహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి



దర్యాప్తు చేస్తున్నట్లు హసన్ పర్తి పోలీసులు పేర్కొన్నారు. జాతీయ రహదారినపై ధర్నా నిర్వహించి విధులను ఆటగించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు రోడ్డు ప్రమాద తీవ్రతను చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎన్ హెచ్ 563 హసన్ పర్తి ప్రధాన రహదారి పై బైటాయించి బాధితుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ రెండు గంటల పాటు రాస్తా రోకో ధర్నా నిర్వహించారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్నామని ఆక్సిడెంట్ కు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినా కూడా కేశపూర్ గ్రామస్తులు ఎర్ర గొల్ల చత్రపతి శివాజీ,ఎర్రగుల్ల శ్రీనివాస్, అబ్బనవేన రాజయ్య,దుప్పటి పాల్,మేకల బాబురావు,ఈర సునీల్,బొక్క సరోజన,ఏనుగుల శ్రీనివాస్,కొండపలకల సారయ్య,ఆరేపల్లి రమేష్, ఎనుగాల సుధాకర్,చల్ల మల్లికార్జున్,మంద సునీల్, సందెల బాలరాజు,ఈర బాబు ఆర్ఎంపి,ఎర్ర కృష్ణవేణి,మాజీ సర్పంచ్,పోలు అశోక్,ఎల్తురి రత్నాకర్ మరి కొంతమంది వ్యక్తులు హసన్ పర్తి ఎన్ హెచ్ 563 ప్రధాన రహదారిపై బైటయించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ సుమారు రెండు గంటల పాటు కొత్తకొండ,మేడారం జాతరకు,సంక్రాంతి పండుగకు వెళ్లే ప్రజలకు,అంబులెన్సు వాహన రాకపోకలను అడ్డగించి పోలీసులతో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారంటూ పై వ్యక్తులపై వచ్చిన దరఖాస్తు ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు



## విజేతలకు చీరల పంపిణీ

**కుషాయిగూడ, జనవరి 14 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి కమిషనరేట్ ఉప్పల్ జోన్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ (రంగవల్లి) ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అందమైన ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన కుషాయిగూడ మహిళా పోలీస్ కానిస్టేబుళ్లకు లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్, ఉప్పల్ జోన్ అడిషనల్ డీసీపీ ఎన్. వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు చీరలను అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, పోలీస్ విభాగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, విధి నిర్వహణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి ఆధ్వర్యం వహించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, లయన్ సభ్యులు మహంకాళి నరసింహ చారి, నారా మోహన్ రావు, పోలీస్ సిబ్బంది రంగన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



- **16 లక్షల విలువగల 15 తులాల బంగారు నగలు,5.5 తులాల వెండి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం.**



**హసన్ పర్తి,జనవరి 14(తెలంగాణ ముచ్చట్లు):** పట్టపగలు దొంగతనాలు చేసే పశ్చిమ బెంగాల్ కు చెందిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు కే యూసి ఇన్స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫేరోజ్ షేక్ తండ్రి లాలూ షేక్ (37) ముస్లిం, సుక్ చంద్ తండ్రి జాఫర్ షేక్(33) ముస్లిం, యామిన్ తండ్రి సలీం షేక్ (36) ముస్లిం, ఫిరోజ్ షేక్ తండ్రి కీ"శే అజ్గర్ షేక్ పరారీలో ఉన్నాడని వీరందరూ ముజ్ పారా గ్రామం,బేలదంగా గా తాలూకా,ముర్షిదాబాద్ జిల్లా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందినవారని వీరి నుండి 16 లక్షలు విలువగల 15 తులాల బంగారు నగలు,5.5 తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మద్యం, హెరాయిన్ మత్తు పదార్థాలకు అలవాటు పడి పట్టపగలు దొంగతనాలు చేస్తూ వారి జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించడానికి పట్టపగలు ఇండ్ల తాళాలు పగలగొట్టి బంగారు, వెండి నగలు దొంగలించి డబ్బులతో జల్సాలు చేసుకుంటూ సాగిస్తారని గతంలో పశ్చిమబెంగాల్,ఆంధ్ర, మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారని పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ముజ్ పారా పోలీసులు అరెస్టు చేయగా రెండు నెలలు బయటకు వచ్చిన తర్వాత ముఠాగా ఏర్పడి తెలంగాణలో దొంగతనాలు చేయాలని పథకం వేసుకొని గత సంవత్సరం డిసెంబర్ 17న హనుమకొండకు వచ్చి కేయుసి పోలీస్ స్టేషన్ పరిధిలో పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ ఇండ్లలో దొంగతనం చేసి వెళ్లిపోయారని ఆ తరువాత మళ్లీ ఈనెల 10వ తేదీన హనుమకొండకు వచ్చి మధ్యాహ్నం గోపాలపురం, శివసాయి కాలనీలో ఒక ఇంటి తాళం పగలగొట్టి సుమారు 15 తులాల బంగారు నగలు,5.5 తులాల వెండి నగలు కొంత నగదు దొంగలించినట్లు పేర్కొన్నారు. ఇట్టి విషయంలో పోలీస్ కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు డీసీపీ సెంటర్ జోన్ దారా కవిత పర్యవేక్షణలో అడిషనల్ డిసిపి క్రైమ్ బాలస్వామి, ఏసీపి క్రైమ్ పి.సదయ్య, ఏసీపి హనుమకొండ పి. ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో ఆచూకీ కోసం ఆరా తీస్తున్న క్రమంలో నిందితులు మళ్లీ దొంగతనాలు చేయడానికి కే యూ సి జంక్షన్ దగ్గరకు వచ్చి ఉన్నారనే పక్కా సమాచారం మేరకు కే యూ సి, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా కేయూసీ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా పోలీసులను చూసిన నిందితులు పారిపోతున్న క్రమంలో పట్టుకొని విచారించగా వారి నుండి సుమారు 15 తులాల బంగారు నగలు, ఐదు తులాల వెండి నగలను, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కేయూసి సి ఐ రవికుమార్ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సి సి ఎస్ ఇన్స్పెక్టర్ కే.రామకృష్ణ, కే యూ సి ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఐటీ కోర్ టీం ఏ ఏ ఓ ఎండి. సల్మాన్ భాష, సిసిఎస్ రాజ్ కుమార్, సాయి ప్రసన్న కుమార్, శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్లు టి.మధుకర్,బి.చంద్రశేఖర్, ఎస్.రాములు,జి.ఉపేందర్, కే. వంశీ.జి.విశ్వేశ్వర్,జి.వినోద్ లను అభినందించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

**తెలంగాణ ముచ్చట్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో పలు ప్రాంతాల నుంచి పంపించిన ముగ్గులు**









































































Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in